
Author of Highest
Number of Novels In Telugu
సూర్యదేవర
రామ్మోహనరావు
యాత్ర-1

# యాత్ర-1

ఒకే వేటు.

పస్న తెగి జలజలమని శబ్దం చేస్తూ నేలకూలింది పచ్చటికొమ్మ. శబ్దం వింటూనే ముందుపోతున్న వృద్ధయోగి చివ్వున వెనుతిరిగి చూశాడు.

ఆయన చూపుల తీక్షణతను చూసి కంగారుపడుతూ ఆయన్ని అనుసరిస్తున్న సేవకులిద్దరూ అక్కడే ఆగిపోయారు. ఒకడి చేతిలో ఉంది పొడవాటి కత్తి. వాడు నరికిన కొమ్మ నేలమీద అడ్డంగా పడుంది.

"వృక్షో రక్షతి రక్షిత:!, అన్నారు పెద్దలు. మూర్ఖా. ఆ వృక్షశాఖ నెందుకు నరికావు?" ప్రశాంతవదనంతో అడిగాడాయన.

"గురువుగారూ... ఇది దారికి అడ్డంగా ఉంది. అందుకని...." నసిగాడు నరికినవాడు.

"నేను కొమ్మ కిందనుంచి దూరివచ్చాను గదా. రాలేకపోయారా? పక్కకు తప్పుకోవడానికి అవి పశువులు కాదు, పచ్చని చెట్లు. మనమే తప్పుకుపోవాలి. వృక్షము యొక్క అంగములు శాఖలు. ఆకులు వాటికి ఆహారాన్నందిస్తాయి. కొమ్మ నరికితే పచ్చటి ఆ కొమ్మ ఎండిపోతోంది. వృక్షానికి ఆహారం తగ్గుతుంది. మిమ్మల్ని ఆకలితో మాడిస్తే ఆకలి బాధ ఏమిటో మీకు తెలుస్తుంది. చెట్లనుగాని కొమ్మలనుగాని నరకటం మహా పాప కార్యం. అవసరమైతే తప్ప కత్తి వాడకూడదు. ఇది కీకారణ్యం.

మనమే దారి చూసుకుపోవాలి. అర్థమైందా?" మేఘ గంభీర స్వరంతో పలిందాయన గొంతు.

బుద్ధిమంతుల్లా తలాడించారు ఇద్దరూ.

ఆ ఇద్దరిలో ఒకడు ఆయన కారు డ్రైవరు. కత్తి పుచ్చుకుంది వాడే. అతడి పేరు కాశి. రెండోవాడు ఆయన సేవకుడు. పేరు పులికొండయ్య. స్థానిక గిరిజనుడు. రంపచోడవరం అటవీప్రాంతంలోని చెట్టు, పుట్ట, కొండ, కోన అన్నీ వాడికి తెలుసు.

ఇంకా చెప్పాలంటే అతడి తండ్రి పులిమల్లు కూడా కట్టెదుట వున్న ఆ గురుస్వామి దగ్గరే పనిచేశాడు. ఆయన గతించాక ఆయన స్థానంలో పులి కొండయ్య పనిచేస్తున్నాడు.

అప్పటికి సూర్యోదయమై ఎంతోసేపు కాలేదు. అది దట్టమైన రంపచోడవరం అటవీప్రాంతం. అడవి మీద మంచు పరదాలింకా కన్పిస్తున్నాయి. శీతాకాలం ఆరంభరోజులవి. పక్షుల కిలకిలారావాలతో వాతావరణం ఆహ్లాద భరితంగా ఉంది. చల్లటి శీతల గాలులు వీస్తున్నాయి.

చెట్ల గుబురు కొమ్మల్ని చీల్చుకుని లేత సూర్యకిరణాలు పొగమంచులో దూసుకొస్తున్న దృశ్యం నయనమనోహరంగా ఉంది. ఆకులమీద మంచు బిందువు లింకా మంచి ముత్యాల్లా మెరుస్తూనే ఉన్నాయి.

ఎదురుగా వున్న స్వామి సామాన్యుడు కాదు. ఆరడుగుల ఆజాను బాహుడు.

చూడ్డానికి ఎనభై దాటని వృద్ధుడిలాగానే ఉన్నాడు గాని ఆయన వయసు నూట అయిదు సంవత్సరాలంటే ఎవరూ నమ్మరు. కాని అదే నిజం. తెల్లగా వెండి తీగల్లా ఉన్న జుత్తును లాగి తలమీద ముడివేసుకున్నాడు. నిడుపాటి గుబురు గడ్డం బొడ్డును తాకుతుంది.

కావిపంచె కట్టాడు. భుజం మీద కావితుండు వేసుకున్నాడు. చొక్కా ధరించలేదు. ఛాతీకి అడ్డంగా యజ్ఞోపవీతం ప్రకాశిస్తోంది. కుడిచేతిలో వెండి పొన్ను కర్ర, కాళ్ళకి కిర్రుచెప్పులు, మెడలో రుద్రాక్ష - తులసి - శ్రీగంధంతో కూడిన మాలలున్నాయి.

ఆయన శరీరం బంగారు వన్నెఛాయలో మెరిసిపోతోంది. కాని ఆ వంటి మీది చర్మం ఎక్కడా ముడతలు పడిన జాడ కన్పించదు.

మనిషి సన్నగా, పొడవుగా వున్నాడు. విశాలమయిన ఛాతీ, సన్నటి నడుం, కోటేరులాంటి ముక్కు, సూదంటురాళ్ళలా ఆకర్షించే చురుకైన చూపులు, శంఖంలా మెడ, తెల్లటి గుబురు కనుబొమలు, పాల భాగంలోని మూడు ముడతలు ఆయన విశేష అనుభవాల్ని చాటుతున్నాయి.

వందేళ్ళు దాటినా ఆ మహనీయుని నడుం వంగలేదు. కంటి చూపు తగ్గలేదు. ఒక్క పన్నుకూడా ఊడలేదు. నుదుట విభూదిరేఖలు భ్రూమధ్యంలో ఎర్రటి బొట్టుతో చూడ్డానికి కైలాసం నుండి దిగివచ్చి వనవిహారం చేస్తున్న కైలాసనాధుడా అన్నట్టు ఆశ్చర్యం గొలిపే అద్భుత రూపం ఆయనది.

ఆయన ఎవరు. ఎక్కడివాడనే సందేహం కలగవచ్చు. ఆయన పేరు ధన్వంతరీ అగ్నివేశాచార్యుడు.

ఆయన గురించి చెప్పాలంటే మాటలు చాలవు. అనేక విద్యలకు నిలయం ఆయన. పదిభాషలు అనర్గళంగా వ్రాయను, చదవను, మాట్లాడను తెలిసిన విద్వాంసుడు. గొప్ప ఆయుర్వేద వైద్యుడు. మంత్ర తంత్ర యంత్ర యోగసాధనలో దిట్ట. అద్భుతాలు సాధించిన అసాధారణమైన వ్యక్తి.

అడవిలోని ఆకు అలములన్నీ అయనకు కొట్టినపిండి. ఏ మూలికలు ఏ ప్రాంతంలో దొరుకుతాయో, ఏ సీజన్‌లో దొరుకుతాయో ఆయనకు తెలిసినంతగా ఎవరికీ తెలీదు.

స్వతహాగా ఆయుర్వేద వైద్య కుటుంబం నుంచి వచ్చినవాడు గావటం చేత నిత్యపరిశోధకుడు. ఆయుర్వేదంలో వివిధ ప్రయోగాల ద్వారా కొత్త మందుల్ని ఆవిష్కరిస్తుంటాడు.

ఆయన గొప్ప శివభక్తుడు. యోగసాధకుడు తపశ్శాలి. వేద వేదాంగాలు, అష్టాదశపురాణాలు, ఇతిహాసాలను ఔపోసపట్టిన విద్యాంసుడు. చూడ్డానికి సాధారణ సాధువులా వున్న ధన్వంతరీ అగ్నివేశాచార్యుల వారికి దేశవిదేశాల్లో మంచి పేరుంది. ఆయన రాసిన సుప్రసిద్ధ ఆయుర్వేద గ్రంథాలు అనేకం ఉన్నాయి.

ఆయన చేయి తాకితే చాలు ఎలాంటి రోగమైనా పారిపోతుందని చెప్పుకుంటారు. అయితే ఆయన దర్శనం దుర్లభం. చాలా అరుదుగా సామాన్యులకు కన్పిస్తుంటాడు. నిరంతర అన్వేషి, ఎప్పుడు, ఎక్కడ ఉంటాడో బంధువర్గానికిక్కూడా తెలీదు.

"ఏమిరా పులికొండయ్య?" ముందు నడుస్తున్న అగ్నివేశాచార్యులవారి పిలుపు విని ఉలికిపడ్డాడు సేవకుడు పులికొండయ్య. "అయ్యా, మీ వెనుకే వస్తున్నాం" అనరిచాడు వెంటనే.

చేతికర్రతో పొదలు, చిరుకొమ్మల్ని తప్పించి చకచకా ముందుకు సాగుతున్నాడాయన. కిర్రు చెప్పుల మోత, చేతికర్ర మువ్వల శబ్దాలకు సమీపంలోని పురుగుపుట్ర దూరంగా తొలగిపోతున్నాయి.

కురు వృద్ధుడైనా ఆయన నడకలో కొంచెంకూడా తడబాటులేదు. యువకుడిలా చరచరా నడుస్తున్నాడు.

"మీ నాయన బతికివున్న రోజుల్లో తనెప్పుడూ నాకు ముందే నడిచే వాడురా! నువ్వు వెనకబడిపోతున్నావ్. మీ నాయన హుషారు నీలో లేదు. ఎందుచేత?" నడుస్తూనే అడిగాడు ఆచార్యుడు. ఆయన ప్రశ్నకు ఎలా బదులివ్వాలో తెలీక తికమకపడ్డాడు పులికొండయ్య.

"అయ్యా. మా నాయన కాలం వేరు. మా కాలం వేరు. ఆ జవసత్వాలు ఇప్పుడెక్కడివి...."

"కాలాన్ని వేరు చేయకురా. ఏ కాలమైనా ఒక్కటే. మనం ఏది కోరుకుంటే అదే ఇస్తుంది. నన్ను చూడు. కాలాన్ని ఎదిరించి నిలబడలేదూ?..."

"మీతో మాకు పోలికా స్వామీ! మీరు కొండశిఖరం లాంటివారు- మేం కొండ కింద గులకరాళ్ళ వంటివాళ్ళం. మా నాయన అదృష్టవంతుడు. తను బతికినంతకాలం మీ సేవలోనే గడిపాడు. మీ అంతటి వారికి ముందు నడిచే యోగ్యత నాకు లేదు సామీ. అందుకే మీ వెనకే వస్తున్నా" అంటూ బదులిచ్చాడు పులి కొండయ్య.

"ఊ... నువ్వు మాటలతోనే ఒతికేస్తావురా. మీ నాయనకిన్ని మాటలు తెలీదు. యోగ్యత ఎవరికి వారు నిర్ణయించుకునేది కాదు.

ఎదుటివారు నిర్ణయించాలి. ఆమ్లవృక్షః సదాసేవ్యం, తచ్ఛాయ ఫల భక్షణం ఆయురారోగ్య శాంత్యర్థం, సేవనీయః బుధోత్తమైః అన్నారు"

శ్లోకానికి అర్థం తెలీక బుర్ర గోక్కున్నాడు పులి కొండయ్య. పక్కన నడుస్తున్న కాశి వంక చూశాడు. తనకూ తెలీదని బుర్ర అడ్డంగా ఊపాడు వాడు.

"అంటే అర్థం ఏంది సామీ?" ధైర్యం చేసి తనే అడిగేశాడు పులి కొండయ్య.

అడుగులు ముందుకు సారిస్తూనే బదులిచ్చాడు అగ్నివేశాచార్యుడు.

"బుధోత్తమైః అనగా ఉత్తములైన బుధులు. బుధులు అంటే జ్ఞాన వంతులు, తెలివైనవారని అర్థం. తెలివి వుంటే చాలదు. వారు మంచివారై ఉండాలి. ఆమ్లవృక్షం సదాసేవ్యం... అనగా సదా ఉసిరిచెట్టును పూజించాలని అర్థం. ఆమ్లవృక్షం అనగా ఉసిరిచెట్టు.

కాబట్టి ఈ శ్లోకార్థం ఏమంటే ఆయురారోగ్య వృద్ధిని కోరుకునేవారు సదా ఉసిరిచెట్టును పూజిస్తూ దానినీడలో ఉసిరిఫలాలను తింటూండాలని అర్థం.

కాబట్టి ఉసిరిలో రాచ ఉసిరి శ్రేష్ఠం. వీటిని తినే వారికి మధుమేహం, రక్తపోటు వంటివి దరిచేరవు. ఆరోగ్యాన్ని అందించే అద్భుతమైన చెట్టు ఉసిరిచెట్టు" అంటూ వివరించాడు.

"అర్థమైంది సామీ. మీరు ఉసిరిచెట్టు లాంటోరు. అందుకే మీ సేవలోనే జీవిస్తున్నాను" అన్నాడు పులికొండయ్య.

"ఉత్తినే జీవిస్తే చాలదురా మూర్ఖా. నమ్మకంతో జీవించాలి. నా మీద నమ్మకం ఉంటే నాకన్నా ముందు నడుస్తావ్. అలా వెనుకకాదు. నేనుండగా ఏ

పురుగూ నిన్నేమీ చేయదు. రా... నాకు ముందు నడువ్ చూద్దాం.” ఆ మాటలతో పులికొండయ్యకి రోషం వచ్చింది.

“సామీ నన్ను రెచ్చగొడుతున్నారు. నాకెలాంటి భయమూ లేదని ఇప్పుడే... ఇప్పుడే నిరూపిస్తాను చూడండి” అంటూ చరచరా ముందుకెళ్ళాడు.

అయిదడుగులు వేశాడో లేదో అంతలో తనకన్నా వేగంగా తన పక్కన ఏదో జరజరా పాకటం చూసి అదిరిపడి “అయ్యబాబోయ్ పాము... పాము” అనరుస్తూ ఎగిరి వెనుక వస్తున్న కాశి మీద పడి వాటేసుకున్నాడు. ఆ అరుపు వినగానే అక్కడే ఆగి చివ్వున వెనుతిరిగి చూశాడు అగ్నివేశాచార్యుడు.

నిజంగానే పాము. పులికొండయ్య బెదిరిపోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అయిదు మూరల పొడవున నిగనిగ మెరుస్తున్న కృష్ణసర్పం. వాళ్ళిద్దరి పక్కగా రివ్వున వచ్చేస్తోంది.

ఎప్పుడైతే ఆచార్యుడు వెనుతిరిగి చూశాడో ఆ మరుక్షణం అది మంత్రం వేసినట్టు అక్కడే ఆగిపోయి చుట్టచుట్టుకుని మూడడుగుల ఎత్తున చేటంత పడగ లేపి ఆడనారంభించింది.

అంత పెద్ద సర్పాన్ని చూడగానే భయంతో కొయ్యబారిపోయి ఉన్న చోటే నిలబడిపోయారు సేవకులిద్దరూ. అయితే ఒక అద్భుతం కళ్ళ ముందు కన్పిస్తోంది ఇద్దరికీ.

అంతటి కృష్ణసర్పం తనను సమీపిస్తున్న ఆచార్యుడిని చూసి వినయంగా నమస్కరిస్తున్నట్టు పడగను నేలకు వాల్చి నెమ్మదిగా పైకి లేపింది.

“శివోహం! ఏమైందయ్యా పొద్దుటే ఇలా వచ్చావ్?” ఎవరో ఆప్తుడ్ని పలకరించినట్టు ఆ నాగాన్ని ఆప్యాయంగా పలకరించాడాయన.

నాల్కలు తాకుతూ ఆయన్నే చూస్తోందా ఉరగం. దాని రూపం చూస్తున్న సేవకులిద్దరికీ పై ప్రాణాలు పోయినంత భయంగా ఉంది.

ఏ క్షణంలో ఏం చేస్తుందోనని కంగారు. కాని ఆ వృద్ధ ఆచార్యునికి అది ఆటబొమ్మలా ఉంది. నిర్భయంగా వంగి పడగమీద చేయి ఉంచాడు.

“నీ ఆగడాలు తట్టుకోలేక ఆ మహేశుడు తన మెడలోంచి లాగి నిన్ను నేల మీద పడేశాడా? ఎవరికోసం వచ్చావయ్యా... నాకేమన్నా చెప్పాలను

కుంటున్నావా? పనిమీద పోతున్నాను. వెళ్ళిపోరాదూ?" అన్నాడు సర్పం వెళ్ళలేదు. ఉన్నట్టుండి కదిలింది. ముందుకొచ్చి ఆయన కాళ్ళను చుట్టుకొని వీపుమీదుగా భుజంమీదికెళ్ళి మెడను చుట్టుకొని తలమీద పడగనివిప్పింది. దీని చర్యతో అగ్నివేశాచార్యుడి ముఖంలో ఆందోళన కొట్టొచ్చినట్టు కన్పించింది.

ఆ నాగరాజు సూచనలు గ్రహించగల శక్తి ఆయనకుంది. ఆవేమీ తెలీని సేవకులు ఇద్దరూ శిరస్సున సర్పంతో నటరాజులా వెలిగిపోతున్న ధన్వంతరీ అగ్నివేశాచార్యులను చూసి పులకించిపోతూ సాష్టాంగపడి నమస్కరించారు. "సర్పరాజా... ఏమైందయ్యా. మా వాళ్ళకు ఎవరికి ఏమపకారం జరిగింది?" ఆందోళనతో పలికింది ఆచార్యుడి గొంతు.

అదే సమయంలో – డ్రైవరు కాశిభుజానవున్న బ్యాగ్‌లోంచి శాటిలైట్ ఫోన్‌మోగిన శబ్దం అందర్నీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది.

* * * * *

**అ**మ్మా, దేవమ్మ తల్లి. ఎక్కడున్నావమ్మా. నా మనవరాలు చచ్చిపోయేలా వుంది. త్వరగా బయటకు రా తల్లీ. అర్జంటుగా మావయ్యను పిలమ్మా...." బయటినుంచి దుఃఖభరితమైన పరిచిత స్వరం వింటూనే ఉలికిపడింది దేవమ్మ.

చేస్తున్న పనిని అలాగే వదిలేసి వేగంగా భవంతిలోంచి బయటికి పరుగెత్తుకొచ్చింది. ఆమెతోబాటే మనవరాలు శ్రావణి. మరికొందరు కూడా గబగబా బయటికొచ్చారు.

ఎదురుగా ఒక పెద్దాయన ఎనిమిదేళ్ళ పాపను చేతులమీద మోసుకొస్తూ గొల్లుమంటున్నాడు. ఆయన వెనుకే బంధుజనం కొందరు ఉరుకులు పరుగులమీద వస్తున్నారు.

పాప నోటివెంట సబ్బునురగలా నుచ్చులు గ్రక్కుతోంది. చూడగానే విషయం అర్థమైపోయింది దేవమ్మగారికి. పాపను పాము కరిచింది.

గబగబా వాకిట్లోకి వచ్చింది డెబ్బై సంవత్సరాలు దాటిన వయసులోని దేవమ్మ, వృద్ధుడి చేతుల్లోని పాపను చూసింది. పరిస్థితి చాలా విషమంగా ఉంది. పాపకళ్ళు తేలవేస్తోంది. నోటి వెంట నుచ్చులు వస్తున్నాయి. బ్రతుకుతుందోలేదో తెలీదు.

పాము కరిచి కూడా ఎక్కువసేపు అయినట్లులేదు. "వద్దంటే వినకుండా పూలకోసం సంపెంగ పొద వద్దకెళ్ళిందమ్మా. నాగపాము కాటేసింది."

"పాముని చూశారా?" అడిగింది దేవమ్మ.

"కనబడిందమ్మా, గోధుమ త్రాచు" ఆయన వెంట వచ్చిన వాళ్ళలో ఒకరు చెప్పారు.

పాపను ఆరుగుమీద పరుండజేశారు. క్షణాల్లో చుట్టుపక్కల జనం చేరిపోయారు. అందరిలోనూ ఒకటే ఉత్కంఠత. పాప బతుకుతుందా!

ప్రశాంతమైన ఆ ఇంటి వాతావరణం ఒక్కసారిగా రణగొణధ్వనితో నిండిపోయింది.

పాప తాలూకు తాతగారి పేరు శివగోపయ్య. ఆయన దేవమ్మగారి బంధువర్గంలోవాడే. ముఖ్యంగా దేవమ్మ మావగారైన ధన్వంతరీ అగ్నివేశాచార్యులకు మిత్రుడు, కావలసినవాడు.

"కంగారు పడకయ్యా, సమయానికి మావగారూ ఊళ్ళోలేరు. అంతా ఈశ్వరేచ్ఛ. కాస్త స్థిమితంగా ఉండండి. మన ప్రయత్నం మనం చేద్దాం" అంటూ వేగంగా పెరట్లోకి వెళ్ళింది దేవమ్మ. అది తూర్పుగోదావరి జిల్లాలో ఒక మారుమూల ప్రాంతం. రాజమండ్రి నుండి రోడ్డు మార్గంగా కేశవరం దాటి ద్వారపూడి వద్ద వంతెన దాటి మండపేట చేరుకోవాలి.

అక్కడి నుండి ద్రాక్షారామం, రామచంద్రపురం మార్గంలో అయిదు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే అక్కడ కుడిపక్కగా ఒక గ్రావెల్ రోడ్డు చీలిపోతుంది. ఆ రోడ్డులో మూడు కిలోమీటర్ల దూరం లోనకు వెళ్తే అక్కడుంటుంది మున్నలూరివారి అగ్రహారం. చుట్టూ పంటపొలాలు, పచ్చని తోటలనడుమ ఉన్న అందమైన చిన్న గ్రామం ఈ అగ్రహారం. ఒకప్పుడు అగ్రహారాలున్నా స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన మార్పుల కారణంగా నేడు అగ్రహారాలు కానరావు. కాని ఇప్పటికీ అగ్రహారంగా పిలవబడే ఊళ్ళు కొన్ని ఉన్నాయి. ఇక్కడా అదే జరిగింది.

అగ్రహారం నుండి కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు చెదిరిపోగా కొన్ని మిగిలేవున్నాయి. క్రమంగా ఇతర కులస్తులు కూడా ఇక్కడ చేరినా నేటికీ ఆ ఊరు మున్నలూరువారి అగ్రహారంగానే పిలవబడుతుంది.

ఒకప్పుడు మున్నలూరివారి పేరుమీదుగా వెలసి నందున అది మున్నలూరువారి అగ్రహారమైంది. జరిగిందేమంటే అయిదు తరాల క్రితం కృష్ణాజిల్లాలోని మున్నలూరు గ్రామంలో ధన్వంతరి వేదాచారి అనే గొప్ప ఆయుర్వేద వైద్యుడు ఉండేవాడు.

దేశంలో ఎక్కడా నయంగాని జబ్బుల్ని కూడా ఆయన నయం చేస్తాడని హస్తవాసి మంచిదని పేరుండేది. అప్పట్లో పిఠాపురం జమీందారుగారి బంధువు ఒకాయన ధవళేశ్వరంలో జమీందారీకి అనుబంధంగా పనిచేసేవాడు.

ఆయన తాతగారు అంతు చిక్కని వ్యాధితో బాధపడేవారు. ఎక్కడా తగ్గలేదు. ఎవరో చెప్పగా విని మున్నలూరు కెళ్ళగా నెల తిరక్కుండానే తాతగారి వ్యాధి నయమైంది. దాంతో ధన్వంతరి వేదాచారి పేరు మొదటి సారిగా బయట జిల్లాకు పాకింది.

ఆ తర్వాతి పరిణామాల్లో జమీందారుగారి అభ్యర్థనతో ధన్వంతరి వేదాచారి తూర్పు గోదావరి జిల్లాకు వలస వచ్చేశారు. ఆయనతో బాటే మరొ కొన్ని బ్రాహ్మణ కుటుంబాలూ వచ్చాయి.

జమీందారుగారు వారందరికీ ఇక్కడ స్థలాలిచ్చి అగ్రహారం నిర్మించి ఇచ్చారు.

ముఖ్యంగా ధన్వంతరి వేదాచారి జమీందారీ ఆస్థాన వైద్యుడు గావటంతో జమీందారు గారి అనుగ్రహంతో బాటు చుట్టుపక్కల ధనవంతుల వైద్యుడై బాగా ఆస్తులు, పొలాలు సంపాదించాడు.

మున్నలూరు నుంచి వలసవచ్చిన వారు గాబట్టి ఆ గ్రామాన్ని మున్నలూరి వారి అగ్రహారం అయింది. అదే వేదాచారి కుటుంబానికి ఇంటి పేరుగా మారిపోయింది. మున్నలూరు ధన్వంతరీ వేదాచారి గారికొడుకే మున్నలూరు ధన్వంతరీ అగ్నివేశాచార్యుడు. జరిగిన తరాలకు వారధి ఆయన.

అప్పట్లో ఆయన తమ్ములు ఇద్దరు, ఒక చెల్లెలు కలిసి వేదాచారి గారికి నలుగురు సంతానం. అగ్నివేశాచార్యుడు పెద్దవాడు. వాళ్ళందరికీ పెళ్ళిళ్ళయి పిల్లలు కలగడంతో కుటుంబం పెరుగుతూ వచ్చింది.

మున్నలూరు అగ్నివేశాచార్యుడి పెద్దకొడుకు ఆత్రేయ మహర్షి. ఆయన భార్య దేవమ్మ. కొంతకాలానికి పెద్దకొడుకు గతించడంతో పెద్దకోడలు దేవమ్మ మీద ఇంటి భారం పడింది.

ఇక ఏ విధంగానయితే నేమీ అగ్నివేశాచార్యుడి కొడుకులు, మనవలు, ముదిమనవలతో కూతుళ్ళ సంతానంతోసహా కలిపి యాభై కుటుంబాలపైనే వున్నాయక్కడ. ఏ కుటుంబానికి ఆ కుటుంబం సొంత ఇళ్ళు ఉన్నాయి.

కొన్ని కుటుంబాలు ఉద్యోగ రీత్యా బయటకు వెళ్ళినా వచ్చి పోతూనే వుంటారు. అగ్నివేశాచార్యుడే ఆ అగ్రహారానికి పెద్దదిక్కు. అధిపతి అంతా. ఆయన మాట అక్కడ వేదవాక్కు.

భర్తపోయిన తర్వాత నుంచి పిల్లల్ని చూసుకుంటూ మావగారి సలహాలు సూచనలతో దేవమ్మ కూడా ఆయుర్వేద వైద్యంలో కొంత ప్రావీణ్యం సంపాదించింది. మావగారు ఊళ్ళో లేనప్పుడు వైద్యం కోసం చుట్టుపక్కల నుంచి ఎవరొచ్చినా ఆవిడే చూస్తుంది.

చుట్టూ విశాలమైన కాంపౌండ్‌లో ఉన్న భవంతులన్నీ మున్నలూరి వారి కుటుంబాలవే. ఎంట్రన్స్ గేటుకి ఎదురుగా ఉండేది అగ్నివేశాచార్యుడి నివాసం. ఆ పక్క భవంతిలో కోడలు దేవమ్మ ఉండేది.

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ఆవరణ ఇప్పుడు జనంతో నిండి పోయింది. ముక్కు పచ్చలారని పాప పాముకాటుతో ఏమైపోతుందోనని అంతా భయాందోళనలతో ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

"ఏమిటో ఈ పల్లెటూరి జనం. వీళ్ళ పిచ్చిగాని పాము కరిస్తే వెంటనే పెద్దాసుపత్రికి తీసుకెళ్ళాలిగాని ఇలా మందో మాకో వేస్తే తగ్గుతుందా? మంత్రాలకు చింతకాయలు రాలవు. ఆ పిల్ల బతకటం కష్టం" దారినపోతూ ఆగి చోద్యంచూస్తున్న పొరుగూరి కుర్రాళ్ళు ఇద్దరిలో ఒకడు కామెంట్ చేశాడు.

"ష్. నాతో అంటే అన్నావ్, ఎవరితోనూ అనమాక. చంపేస్తారు. ఈ అగ్రహారం గురించి, లోపలి వైద్యుల గురించి తెలిస్తే నువ్విలా మాట్లాడవు. చూస్తూండు ఏం జరుగుతుందో" అంటూ లోగొంతుతో హెచ్చరించాడు రెండోవాడు.

ఈ లోపల పెరట్లోకి వెళ్ళిన దేవమ్మ బయటికొచ్చింది. ఆ భవంతి వెనక పెరట్లో అద్భుతమైన అనేక మూలికలు పెంచబడుతున్నాయి. ఆవిడ బైటికొస్తూనే చేతిలోని ఆకుల్ని నలిపి పాపముక్కులో కొన్ని చుక్కలు, నోట్లో కొన్ని చుక్కలు పిండింది.

పాము కాటువేసినచోట కొన్ని చుక్కలు వేసింది. కొద్దిసేపటికి నోటి నుండి నుచ్చలు రావటం ఆగింది కాని పాపపరిస్థితి గడ్డుగానే ఉంది.

దేవమ్మ ముఖంలో ఆందోళన తొంగిచూసింది. ఈ లోపల మనుమరాలు శ్రావణి లోపలినుంచి సెల్‌ఫోన్ తెచ్చి ఇచ్చింది. వెంటనే ఒక నంబర్‌కు ఫోన్ చేసింది దేవమ్మ. ఇక్కడ ఫోన్ చేయగానే ఎక్కడో రంపచోడవరం లోతట్టు అటవీ ప్రాంతంలోని శాటిలైట్ ఫోన్ మోగటం ఆరంభించింది.

అగ్నివేశాచార్యుడి విశాల ఫాలభాగం ముడిపడింది. ఫోన్‌లో కోడలు దేవమ్మ చెబుతున్న విషయాన్ని ఆయన శ్రద్ధగా వింటున్నాడు.

ఆయన తలమీద పడగవిప్పి ఆడుతూ భుజాలమీద కృష్ణసర్పం అలాగే ఉంది. కోడలి మాటలతో అక్కడ మున్నలూరివారి అగ్రహారంలో ఇంటివద్ద పరిస్థితి అర్ధమైంది తనకి కృష్ణసర్పం ఎందుకు అడ్డం పడిందో కూడా తెలిసిపోయింది.

"శివగోపయ్య నా మిత్రుడు" ఫోన్‌లో కోడలికి చెప్పాడు. "వాడి మనవరాలు శ్రద్ధ నాకూ మనవరాలే. వచ్చేముందు నా ఒడిలో కూచుని కబుర్లు చెప్పిన చిట్టితల్లికి ఇంత కష్టం రాకూడదు.

దాన్ని మనం బ్రతికించుకోవాలి. ఇప్పటి పరిస్థితిలో మందులతో పనికాదు. చాలాకాలంగా వదిలేసిన విద్యను ఇప్పుడు శ్రద్ధ కోసం ప్రయోగిస్తాను. కరిచిన పామును వెనక్కి రప్పించి విషం తీయిస్తాను. ఏం జాగ్రత్తలు తీసుకోవాలో నాకు తెలుసు. ఫోను ఒకసారి పాప చెవిదగ్గర ఉంచు" అన్నాడు.

తర్వాత రెండు నిముషాలపాటు ఫోన్‌లో ఏవో మంత్రాలు పఠించి తర్వాత లైన్ కట్‌చేశాడు.

ఇప్పుడు తూర్పు దిక్కుగా ముఖం ఉంచి ఉన్నచోటే కూచుని భుజాలమీది కృష్ణసర్పాన్ని జాగ్రత్తగా తీసి నేలమీద ఉంచాడు.

దాని బుసలు చూస్తుంటే దూరంగా ఉన్న సేవకులిద్దరికీ గుండెలు బేజారవుతున్నాయి.

"నువ్వెందుకు వచ్చావో ఇప్పుడు నాకు అర్థమైంది నాగన్నా... నీ ఉపకారం మర్చిపోలేనిది. ఇప్పుడు ఇంకో ఉపకారం కూడా నువ్వు నాకు చేయాలి. నువ్వు నాకు చేయగలవు. నీవల్లనే పని తొందరగా పూర్తవుతుంది.

మా పసిబిడ్డ ప్రాణాపాయంలో ఉంది. వెంటనే ఆ దుష్టసర్పాన్ని అక్కడికి పంపించి విషాన్ని వెనక్కి తీసుకోమను. ఇది నా ఆన" అంటూ అప్పటికప్పుడు చిన్న చీటీమీద ఒక యంత్రాన్ని గీచి దాన్ని మడిచి కృష్ణసర్పం తోకకు కట్టి వదిలాడు. అంతే మెరుపు వేగంతో పొదల్లోకి అదృశ్యమైందా పాము. తను లేచేవరకు పలకరించవద్దని సేవకులిద్దర్నీ హెచ్చరించి, మంత్ర ప్రయోగం చేస్తూ ధ్యానంలో ఉండిపోయాడు అగ్నివేశాచార్యుడు. పులికొండయ్య, కాశీ ఇద్దరూ పక్కన చెట్టుకిందకు పోయి కూచున్నారు.

(ఇక్కడ చాలాకాలంగా వదిలేసిన విద్యని ఇప్పుడు ప్రయోగిస్తాను అని అగ్నివేశాచార్యుడు చెప్పడంలో తగిన కారణం ఉంది. పాముని వెనక్కి రప్పించటం అనేది గొప్ప మంత్రగాళ్ళు చేసేపని.

ఒక చీటిమీద యంత్రం రాసి తొండ మెడలో కట్టి వదులుతారు. ఆ తొండ కాటువేసిన పాము పడగమీద కూచుని తీసుకొస్తుంది.

తను వేసిన కాటుమీద తిరిగి కాటువేసి విషాన్ని వెనక్కు తీసుకుని వెళ్ళిపోతుంది పాము. అయితే తొండకి బదులు మరో పాముకే చీటీకట్టి పిలిపించటం. అదీ సంఘటనా స్థలానికి సుదూరంలో ఉండి ప్రయోగించటం అంటే అది మహా మంత్రగాళ్ళకే సాధ్యం. ఇలాంటి సంఘటనలు ప్రత్యక్షంగా చూసిన వాళ్ళు గతంలో చాలామంది ఉన్నారు.

అగ్నివేశాచార్యుడు మహా వైద్యుడే కాదు, మహామంత్రవేత్త కూడా. ఐతే ఇలాంటి ప్రయోగాలు మంత్రగాళ్ళు అంత సులువుగా చేయరు. ఎందుకంటే నాగదోషం, నాగశాపం చాలా తీవ్రమైన ప్రభావం చూపుతాయి.

పాముని వెనక్కి రప్పించినంత మాత్రాన సరిపోదు. విషం తీసుకున్నాక అది సురక్షితంగా తన స్థావరం చేసుకొనేవరకు బాధ్యత మంత్రగాడిదే.

పొరపాటున ఎవరన్నా ఈ లోపల ఆ పాముని కొట్టి చంపితే ఆ దోషం మంత్రగాడి కుటుంబాన్ని నాశనం చేస్తుంది. అలా దెబ్బతిన్న మంత్రగాళ్ళున్నారు. అందుకే తెలిసినా కూడా పాముని వెనక్కి రప్పించరు మంత్రగాళ్ళు. చాలా కాలంగా వదిలేసిన విద్య అని ఆచార్యుడనటంతో అర్థం ఇదే.)

*        *        *        *        *

ఎక్కడి వాళ్ళక్కడ శిలా విగ్రహాల్లా నిలబడిపోయి చూస్తున్నారు. అందరి చూపులు సర్ప ద్రష్ట అయిన చిన్నారి పాప శ్రద్ధమీదే ఉన్నాయి.

ఇది సాధ్యమా, కాటువేసిన పాము వెనక్కు వస్తుందా! విషం వెనక్కి తీసుకుంటుందా! ఇది జరిగే పనేనా? నమ్మశక్యం గావటంలేదే! ఎవరికి వారు తర్కించుకొంటున్నారు. అంతక్రితమే దేవమ్మగారు చేసిన హెచ్చరిక అందరి చెవుల్లోనూ మారుమోగుతోంది. ఉత్కంఠత కలిగిస్తోంది. మామగారు అగ్నివేశాచార్యుడితో మాట్లాడి ఫోన్ శ్రావణి చేతికిస్తూనే అందరికీ వినబడేలా హెచ్చరిక చేసిందావిడ.

"కాటు వేసిన పాము వచ్చి విషం తీసుకోబోతోంది. మీరు కంగారు పడకుండా ఎక్కడి వాళ్ళక్కడ నిలబడి ఉండండి. ఎవరూ కదలవద్దు.

పామును చూసి భయపడొద్దు. మంత్రానికి కట్టుబడిన పాము ఎవరినీ ఏమీ చేయదు. ఎవరూ కదలకూడదు" దేవమ్మగారి హెచ్చరిక సారాంశమది.

ఎప్పుడో పూర్వం ఇలా పామును రప్పించి విషం వెనక్కి తీయించే మంత్రగాళ్ళుండేవారని వినడమేగాని ప్రత్యక్షంగా చూసినవాళ్ళీ కాలంలో లేరు. అందుకే అందరిలో ఈ విషయం మరింత ఉత్కంఠ పెంచి ఊపిరి బిగబట్టి చూసేలా చేసింది. అది సాధ్యమేనా? ఏం జరగబోతోంది?

ఎవరికి వారు పాము ఎటునుంచి వస్తుందోనని నలువంకలా గమనించసాగారు. అరుగుమీద పరుండజేసిన చిన్నారి శ్రద్ధవద్ద ఎవరూ లేరు. అంతా ఎడంగా ఉన్నారు. పాప చూస్తే డొక్కలు ఎగరేస్తోంది. శరీరం కళతప్పి నలుపురంగు తిరుగుతోంది.

ఏం జరగనుంది? పాప బతుకుతుందా? ఆందోళనతో గుండె గొంతులో కొట్టుకుంటుండగా ఆత్రంగా గమనిస్తున్నారంతా. క్షణాలు బారంగా దొర్లి

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Yatra+1**

* * *